నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
గురువారం | ఏప్రిల్ 10, 2025 | www.navatelangana.com

ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు పట్ల హర్షం

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు పట్ల సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హైద్రాబాద్‌లో తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే కలిసి ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుపై కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ట్రామా కేర్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని తాను ప్రస్తావించిన తరుణంలో ప్రభుత్వం కాగజ్‌నగర్‌లోని ఏరియా ఆసుపత్రి వద్ద ఈ సెంటర్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. సిర్పూరు నియోజకవర్గంలో వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో పలు సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించాలని కమిషనర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



సిలిండర్ ధర పెంపుపై సీపీఐ(ఎం) నిరసన

ఆదిలాబాద్‌రూరల్ : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదిలాబాద్ మండలం రాములుగూడలో నిరసన తెలిపారు. గ్యాస్ బుడ్డి, స్టౌవ్‌తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు లంక రాఘవులు మాట్లాడుతూ అంతర్జాతీయంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గితే మోడీ ప్రభుత్వం దేశంలో ధరలు పెంచటం అన్యాయమన్నారు. బీజేపీ ప్రభుత్వం కులం, మతం పేరుతో ప్రజల్లో చీలికలు తెచ్చి మరో పక్క ప్రజావ్యతిరేక విధానాలతో మోసం చేస్తోందని మండిపడ్డారు. అంబానీ, అదానిలకు లాభం చేయటానికే బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.స్వామి, ఎస్.మాధవ్, లలిత పాల్గొన్నారు.



కార్పొరేట్ల సేవలో పేదలపై భారాలు : సంకె రవి

జైపూర్: మోడీ ప్రభుత్వం కార్పొరేటర్లకు మాఫీ చేసిన రూ.16లక్షల30 వేల కోట్లను సామాన్యుల నుండి వసూలు చేసే ప్రయత్నం చేస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. బుధవారం చెన్నూర్ పట్టణంలో కరీంబీ అధ్యక్షతన ఏరియా కమిటి సమావేశంలో మాట్లాడారు.



కార్పొరేట్లకు దోచిపెట్టడానికి పేదలు, చిరు వ్యాపారుల నుండి వసూలు చేస్తున్నారని తెలిపారు. గ్యాస్ సిలిండర్ ధర పెంచి సామాన్యులపై ఆర్థిక భారం మోపారన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ పేదలను పాతాళానికి తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని అభివృద్ధి చేయడమంటే అదానీ, అంబానీలకు దోచిపెట్టడమేనా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ అవన్నీ మరిచి ఖజానా నింపుకునే పని చేస్తోందని మండిపడ్డారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి బోడంకి చందు, సామల ఉమారాణి, సిండం సమ్మక్క, బోండ్ల సరిత, నాగజ్యోతి, రమాదేవి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించేది కాంగ్రెసే : అల్లూరి కృష్ణవేణి



నిర్మల్ రూరల్ : రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి అన్నారు. జై బాపు జై భీం జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సోన్ మండలం కడ్తాల్, సాకెర గ్రామాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెంది సమ సమాజ స్థాపన సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సోన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు వాసవి, శ్రీనివాస్, నవీన్, రాము, విఠల్, దాసు, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, గంజాల్ మాజీ సర్పంచ్ మొయినుద్దీన్, మాజీ సర్పంచ్ రాజనరసింహరెడ్డి, ప్రసాద్ కుమార్, రితీష్‌రెడ్డి, ప్రేమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదర్శ గనికి 50 వసంతాలు పూర్తి

నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియాలో నిర్దేశించిన లక్ష్యాన్ని 100శాతం పూర్తి చేస్తూ ఆదర్శంగా నిలిచిన ఆర్కే-6 గని 50 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం గనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఈ గని అవార్డులు, రివార్డులు గురించి తెలిపారు. ఆర్కే-6 గనికి ఎస్‌డిఎల్ ట్రోఫీ రావడానికి కృషి చేసిన ఉద్యోగులు, ఆఫీసర్స్, సూపర్ వైజర్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గనిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సన్మానించి ప్రతి ఒక్క కార్మికునికి మెమెంటో, స్వీట్ బాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం ఎస్.సత్యనారాయణ, ఆర్కే-5, 6 గ్రూప్ ఏజెంట్ ఎస్.శ్రీధర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరి ఎస్‌కే భాజీ సైదా, గని మేనేజర్ తిరుపతి,సేఫ్టీ ఆఫీసర్ కాదసి శ్రీనివాస్, ఫిట్ ఇంజనీర్ ఎ.శ్యాంకుమార్, వెంటిలేషన్ ఆఫీసర్ రాంనర్సయ్య పాల్గొన్నారు.



ఉపరితల గనుల బాధితులకు న్యాయం చేయాలి



ఆసిఫాబాద్ : జిల్లాలోని గోలేటి ఉపరితలగనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.30 లక్షలతో పాటు కుటుంబంలో ఒకరికి సింగరేణి ఉద్యోగం ఇవ్వాలని నాయకులు కోరారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షులు విశ్వ ప్రసాద్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ కుమారి, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి బాధితులతో కలిసి కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ గనులలో పూర్తి భూమి కోల్పోయి బాధితులు ఇబ్బంది పడే పరిస్థితి ఉందని దానిని దృష్టిలో పెట్టుకుని నష్టపరిహారం చెల్లించాలన్నారు. సింగరేణి కేవలం రూ.7 లక్షలు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుందని, ఇది మార్కెట్ ధరతో పోలిస్తే చాలా తక్కువ అన్నారు. ధరణి ప్రకారం మార్కెట్ ధర రూ.20 లక్షలు ఉందని దానికి మూడింతలు రూ.60 లక్షలు చెల్లించాల్సి ఉన్న నిబంధనలు పాటించడం లేదన్నారు. వెంటనే బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నవీన్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు అవగాహనా సదస్సు

ఆదిలాబాద్‌టౌన్ : సఖీ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్తంగా గుడిహత్నూర్ మండల కేంద్రంలోని సీతాగోంది, పట్వారిగూడ గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు, తోషం పంచాయతీలోని ఇన్కరిగూడ అంగన్వాడీ సెంటర్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం సిబ్బంది లావణ్య సైకో సోషియల్ కౌన్సిలర్ సఖి కేంద్రం అందించే ఐదు సేవలు, న్యాయ, వైద్య సేవలు, పోలీస్ సాయం, తాత్కాలిక వసతి గురించి తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్లు 181, 100, గృహ హింస చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. పని చేసే చోట లైంగిక వేధింపుల నిరోధక చట్టం సమాజంలో మాట్లాడే శక్తివంతమైన భాష(జెండర్ ఇంక్లూజివ్ లాంగ్వేజ్ ఫర్ అఫీషియల్ కమ్యూనికేషన్)పై అవగాహన కల్పించారు. జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి, అక్షరాస్యత నిపుణులు నిఖిలేష్, మహిళా సాధికారత మిషన్ శక్తి పథకం, రాజీవ్ యువ వికాస పథకం, సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్, అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నూతన మెనూ పకడ్బందీగా అమలు చేయాలి

ఆసిఫాబాద్ : విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ నదీమ్ ఖుద్దుసి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో మైనార్టీ గురుకులాల ప్రిన్సిపాళ్ల, వసతి గృహాల సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాలు పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని, కాగజ్‌నగర్‌లోని మైనారిటీ బాలుర గురుకులం-2, ప్రధానమంత్రి శ్రీ పథకం పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. 2025- 26 విద్యా సంవత్సరంలో 100 శాతం ప్రవేశాలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ప్రిన్సిపాళ్లు, సంక్షేమ అధికారులు సత్కరించారు.

సన్న బియ్యం పంపిణీతో సంతోషం..!

- ప్రతి లబ్ధిదారునికి అందేలా చర్యలు
- కలెక్టర్ సహా అధికారుల సహపంక్తి భోజనాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేయడానికి నిర్ణయించి ఉగాది రోజున శ్రీకారం చుట్టింది. మొదట్లో సన్న బియ్యం పంపిణీపై పేద, మధ్య తరగతి ప్రజలకు అపనమ్మకం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సరైన బియ్యం పంపిణీ చేస్తుందా లేదా బాగుంటాయా లేదా ఇలా అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే పథకం ప్రారంభం నుండి పకడ్బందీ ప్రణాళికతో ముందుకు పోతున్నారు. లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేయడంతో ప్రజలకు నమ్మకం పెరగడంతో పాటు పథకం విజయవంతమవుతోంది.



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 2 మున్సిపాలిటీలు ఉండగా వీటిలో 317 రేషన్ దుకాణాలు ఉన్నాయి. రేషన్ కార్డులు మొత్తం 1,39,795 ఉన్నాయి. వీటిలో ఫుడ్ సెక్యూరిటీ కార్డులు 1,26,584, అంత్యోదయ కార్డులు 13191, అన్నపూర్ణ కార్డులు 20 ఉన్నాయి. వ్యక్తికి నెలకు 6కిలోల చొప్పున 30,08,813 కిలోల బియ్యం ఇస్తుండగా, ఫుడ్ సెక్యూరిటీ కార్డులకు 25,46,928 కిలోలు, అంత్యోదయకు 4,61,685 కిలోలు, అంత్యోదయ అన్నపూర్ణ కు 200కిలోల బియ్యం అందిస్తున్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రతి లబ్ధిదారునికి అందేలా చర్యలు

ఇప్పటివరకు రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం ఇవ్వడంతో చాలా మంది లబ్ధిదారులు ఆసక్తి చూపకపోయేది. తీసుకున్న బియ్యం దుకాణాలలో అమ్మి సన్న బియ్యం తీసుకెళ్లి తినేవారు. ఇప్పుడు ప్రభుత్వం పేద, మధ్యతరగతి వారికి అనుకూలంగా సన్న బియ్యం ఇవ్వడంతో పాటు జిల్లాలో ఎక్కువగా దీనిపై ఆధారపడిన గిరిజనులు, పేదలు ఉండడంతో ప్రతి లబ్ధిదారునికి సన్న బియ్యం అందేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

లబ్ధిదారుని ఇంట్లో భోజనంతో క్రేజీ

రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం ఇవ్వడానికి నిర్ణయించిన నేపథ్యంలో కొన్ని చోట్ల అనుమానాలు తలెత్తాయి. వీటిని నివృత్తి చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పటికీ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఇంకాస్త ముందుకెళ్లి లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేయడానికి నిర్ణయించుకున్నారు. ఈ నెల 5న ఆసిఫాబాద్ మండలం ఆర్ఆర్ కాలనీలో తక్సండే శంకర్ ఇంట్లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి భోజనం చేశారు. దీంతో రాష్ట్ర మొత్తం జిల్లా వైపు చూశారు. అనంతరం ఇదే సాంప్రదాయాన్ని రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి పాటించడంతో పాటు మిగతా ప్రజాప్రతినిధులు, అధికారులు, అనుసరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ తీసుకున్న నిర్ణయంతో సన్న బియ్యంపై ప్రజల్లో ఎంతో నమ్మకం కలిగిందని చెప్పొచ్చు. అలాగే ప్రతి మండలంలో మహిళలతో మాట్లాడుతూ సన్నబియ్యం పట్ల పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు.

ప్రతి లబ్ధిదారునికి అందేలా చర్యలు : వెంకటేష్ దోత్రే, జిల్లా కలెక్టర్

రేషన్ దుకాణాల ద్వారా ప్రతి లబ్ధిదారునికి సన్న బియ్యం అందేలా చర్యలు తీసుకున్నాం. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు, సన్న బియ్యంతో వండిన వంట ప్రతిరోజూ తిన్నట్లయితే పోషక విలువలు కూడా పెరుగుతాయి. సన్న బియ్యం విషయంలో ఎక్కడైన ఇబ్బందులు తలెత్తితే వెంటనే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం : తక్సండే శంకర్, ఆర్ఆర్ కాలనీ

రేషన్ దుకాణాల్లో తెచ్చుకున్న బియ్యాన్ని ప్రతిరోజు తింటాం. రాష్ట్ర ప్రభుత్వ నూతనంగా సన్న బియ్యం ఇవ్వడం ఎంతో సంతోషాన్నిచ్చింది. మా లాంటి పేదవారికి ఇది చేయూత నిస్తుంది. స్వయంగా జిల్లా కలెక్టర్ మా ఇంటికి వచ్చి మాతో కలిసి ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యంతో వండిన వంట తినడం నేను ఎప్పటికీ మర్చిపోలేను.

ఘనంగా రాంజీగోండ్ 165 వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

రాంజీ గోండు వర్ధంతి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాంజీ గోండ్ 165 వర్ధంతి సభ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తొడసం శంభు ఆధ్వర్యంలో బుధవారం ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన ఆదివాసీ ప్రజలు కూరన్నపేట్ సమీపంలోని వెయ్యి ఉరుల ప్రాంతం నుండి పాదయాత్ర ద్వారా చైన్ గేట్ వద్ద గల రాంజీ గోండ్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరితో పాటు పటేళ్లు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన పోరాట యోధుడు రాంజీ గోండ్ అని, 1836 నుండి 1860 వరకు బ్రిటిష్ సామ్రాజ్యవాదం, నిజాం దౌర్జన్య పాలనకు వ్యతిరేకంగా ఆదివాసుల పక్షాన సాయుధ పోరాటాన్ని నడిపించిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. 1860 ఏప్రిల్ 9న నిర్మల్‌లో వెయ్యి మంది ఆదివాసులతో కలిసి మర్రిచెట్టు వద్ద ఉరితీయబడ్డ ఘోర చరిత్రను స్మరించుకుంటూ, ఆదివాసీ యువతరం అతని ఆదర్శాలను తెలుసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు పంద్రం ఆనంద్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ పోశెట్టి, సోయం సూర్యభన్, ఉయిక భీంరావు, అర్జున్, పంద్రం సుజాత, శోభ, ఈశ్వర్, వినోద్, నాగరావు, ఎల్లయ్య, లక్ష్మణ్, గణేష్, రాము పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : పోరాట యోధుడు రాంజీగోండ్ 167వ వర్ధంతి సభలు బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పలు చోట్ల నిర్వహించారు. సాత్నాల మండల జంబుల్‌దరి, ఆదిలాబాద్ మండలం రాములుగూడ గ్రామాల్లో నిర్వహించిన వర్ధంతి సభల్లో సంఘం నాయకులు లంక రాఘవులు, ఎస్.స్వామి, మాధవ్, లలిత, దుర్వ మాణిక్‌రావు, వేలది విజయ్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ మండల అర్లి గ్రామంలో జరిగిన సభలో సంఘం అధ్యక్షుడు ఆత్రం కిష్టన్న, కె.లక్ష్మణ్, పటేల్ గోవింద్ పాల్గొన్నారు. సభల్లో నాయకులు లంక రాఘవులు మాట్లాడుతూ రాంజీగోండ్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడచి ఆశయ సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు.



నిర్మల్‌లో రాంజీగోండ్ వర్ధంతి సభ



ఆదిలాబాద్‌రూరల్ : మాట్లాడుతున్న లంక రాఘవులు

నార్నూర్ : నార్నూర్, గాదిగూడ మండలాల్లో రాంజీగోండ్ వర్ధంతి సభలు ఘనంగా నిర్వహించారు. గాదిగూడ మండలం రూపాపూర్ ఆదివాసీ నాయకులు కోట్నాక్ సక్కు, నార్నూర్ మండలంలోని మరపగూడ గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు పూసం ఇత్రు ఆధ్వర్యంలో రాంజీ గోండ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంజీగోండ్ పోరాట చరిత్రను కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో ఆదివాసీ నాయకులు హిరామన్, పరుశురాం, గ్రామ పెద్దలు కుడ్మెత శుక్రు పటేల్, లచ్చు దేవారి, కుడ్మెత రాజారామ్, కోరేంగ సుంకట్ రావ్, సందుర్ షావ్, మాజీ సర్పంచ్ మడావి కేశవ్, కుడ్మెత సోంబాయి, తయుబాయి, లీలాబాయి, చంపాబాయి పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని తాటిగూడ గ్రామంలో దిశ మోడల్ స్కూల్‌లో రాంజీగోండు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు మడావి వెంకటేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, మంగ రమాదేవి, బద్దుల రూప, మడావి శేఖర్ పాల్గొన్నారు. దేవాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో గల కమ్యూనిటీ హాల్‌లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో రాంజీ గోండు వర్ధంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయక్ పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, కొమురం జనార్ధన్, సంద్ర భూమయ్య, రెడ్డి లక్ష్మణ్, పెంద్రం ప్రభాకర్, కుర్సింగ మహేశ్వర్ పాల్గొన్నారు.



నార్నూర్ లో..



కాసిపేటలో..

వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారి ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. అదనపు ఎస్సై నాగరాజుతో కలిసి బుధవారం ఇందారం ఎక్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన విషయం తెల్సిందే. ఎక్స్ రోడ్డు వద్ద తరచు జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ రహదారి నెం.63తో పాటు రాజీవ్ రహదారి మీదుగా ప్రయాణించే వాహనాల వేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రమాదాలను నివారించొచ్చని తెలిపారు.



ఎంపీ నగేష్‌కు సీసీఐ సాధన కమిటీ వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌ను సీసీఐ సాధన కమిటీ సభ్యులు బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ జిల్లాలో మూత పడ్డ సీసీఐని పునఃప్రారంభం కోసం కృషి చేయాలని కోరారు. దీనికి నగేష్ సానుకూలంగా స్పందించి తన వంతుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీఐ సాధన కమిటీ కో కన్వీనర్‌లు విజ్జగిరి నారాయణ, వెంకట్‌నారాయణ, భామన్ జగన్‌సింగ్, ఈశ్వర్‌దాస్, సభ్యులు ఎస్.అరుణ్ కుమార్, అగ్గిమల్ల స్వామి, ఉజ్జిరి విఠల్ పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం పోషణ పక్షం నిర్వహించాలి



నవతెలంగాణ -ఆదిలాబాద్‌టౌన్

పోషణ్ అభియాన్ పోషణ పక్షం 2025లో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పోషణ పక్షం ఏప్రిల్ 8 నుండి 22 వరకు నిర్వహిస్తామని, 15 రోజుల పాటు నిర్వహించే క్రమంలో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోషణ పక్షం 2025పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంపూర్ణ పోషకాహారం అందించే దిశగా పోషణ పక్షం 2025 పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏప్రిల్ 8 నుంచి 22 వరకు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. పోషణ్ సాంకేతికత సంప్రదాయాల సమ్మేళనంతో పిల్లలు మహిళలకు ఆరోగ్యకరమైన, పోషకాహారాన్ని అందించే లక్ష్యంతో పోషణ లోపం ఏ ఊరిలో కనిపించకుండా చేసి, సరైన పోషణతో ఆరోగ్య తెలంగాణ గా తీర్చిదిద్దేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 8 నుండి 22 వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ప్రతి ఇంటింటికి తిరిగి సామ్-మామ్ పిల్లలను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందేలా చూడడంతో పాటు తల్లిపాలు, న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాను అనీమియా ముక్తగా తీర్చిదిద్దేలా ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో అనీమియా పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించేలా యోగా, వ్యాయామం వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అనంతరం పోషణ్ పక్షం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూ మిల్కా, సంబంధిత అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-జైపూర్

రబీ కాలం వరి ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ సూచించారు. బుధవారం చెన్నూర్ పట్టణంలో గల షాదీఖానాలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, డీఆర్‌డీఓ కిషన్, తహసీల్దార్ మల్లికార్జున్‌తో కలిసి సమావేశమయ్యారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తూ ప్రభుత్వ పరంగా రైతుకు మద్దతు ధర చెల్లిస్తామని తెలిపారు. సన్న వరి ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 అదనంగా బోనస్ చెల్లిస్తామన్నారు. వేసవి ఎండలు ముదురుతున్నందున కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తాగు నీరు, చలువ పందిళ్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఓపీఎంఎస్ ట్యాబ్‌లో రైతు వివరాలు నమోదు చేసిన 48గంటల లోపు సంబంధిత నగదు రైతుల ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరి కల్లాల్లో తాలు తప్ప లేకుండా మట్టి పెళ్లలు రాకుండా చూసుకోవడమే కాకుండా తేమ శాతం సరి చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, మార్కెటింగ్ డీపీఎం చెన్నూర్, జైపూర్, భీమారం, మందమర్రి, కోటపల్లి మండలాల పరిధి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని రవీంద్రనగర్-1 విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని కౌటాల విద్యుత్ అధికారి అంజల్ కుమార్ తెలిపారు. గురువారం సరఫరాలో ఉండే అంతరాయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి

వాంకిడి: ఈ నెల 11న మహాత్మా జ్యోతిబాపులే జయంతిని మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాలీ సంఘం ఉపాధ్యక్షుడు గుర్నులే నారాయణ తెలిపారు. కార్యక్రమానికి మాలీ సంఘం నాయకులతో పాటు స్వచ్ఛంద సంస్థ సభ్యులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కళాశాలలో యాంటీ డ్రగ్‌పై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం యాంటీ డ్రగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ డా.అతిక్ బేగం పాల్గొని విద్యార్థులకు మత్తు పానీయాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. సిగరెట్ తంబాకు వల్ల వచ్చే అనారోగ్యం గురించి విద్యార్థులకు తెలియజేశారు. వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిస కవద్దన్నారు. అనంతరం కళాశాల సిబ్బంది యాంటీ డ్రగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో యాంటీ డ్రగ్ కోఆర్డినేటర్ కోటయ్య, మెంబెర్ అనిత పవర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ యాకూబ్‌ఆలీ, వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, కానిస్టేబుల్ వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

షేర్‌గూడను నూతన జీపీగా ఏర్పాటు చేయండి

నవతెలంగాణ-తలమడుగు



పూనాగూడ గ్రామపంచాయతీలో షేర్‌గూడ గ్రామాన్ని విలీనం చేయడంతో దాదాపు మూడు కిలోమీటర్ల దూర భారం పడుతుందని గ్రామస్తులు తెలిపారు. తమ గ్రామాన్ని నూతన జీపీగా ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం కలెక్టర్ రాజార్షి షాకు వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రంలో కోరారు.

ఏదైన సమస్యా?..మెసేజ్ యువర్ ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ ఫోన్ వినియోగం యువత చేతుల్లోకి మరింత అందుబాటులోకి రావడం వల్ల, జిల్లా అధికారులను సులువుగా సంప్రదించాలని వినూత్న ఆలోచనతో ప్రజలకు మరింత చేరువ కావాలని ఉద్దేశంతో మెసేజ్ యువర్ ఎస్పీ పేరుతో నూతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాంతి భద్రతల పరిరక్షణనే ధ్యేయంగా, ప్రజలకు మరింత వేగవంతమైన పారదర్శకమైన సేవలను అందించాలని కార్యక్రమం చేపట్టినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు, సుదూర ప్రాంతాలలో ఉన్న ప్రజలు, ఎలాంటి సమస్యలున్న, ఎలాంటి సమాచారాన్ని అందించాలన్న ఎస్పీకి నేరుగా సమాచారాన్ని అందించవచ్చున్నారు. సమాచారాన్ని అందించే వారు పోలీసు వాట్సప్ నంబర్ 8712659973 కు సంప్రదించాలని తెలియజేశారు. సమస్యలపై పూర్తి వివరాలను రాసి వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. లేదా జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన సంఘవిద్రోహ కార్యకలాపాలు నిర్వహించిన సమాచారం మీకు అందించాలనిపిస్తే ఈ నెంబర్‌కి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

గురుకులాల్లో అవినీతిని అరికట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వాగ్మారే మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి నెలలో లెఫ్ట్ పోచంపాడ్ గురుకుల పాఠశాలలో జరిగిన ఒక అవినీతి పనిగురించి ప్రిన్సిపాల్‌కి ఫోన్‌లో సంప్రదిస్తే ఆమె అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోక నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రతి గురుకుల పాఠశాలలో ఏదో ఒక రకమైన అక్రమ పనులు మూడో కంటికి తెలీకుండా ప్రధాన బాధ్యతల్లో అన్న ఉద్యోగులు, ఇన్‌చార్జిల చేతివాటం ఉందన్నారు. నిర్మల్ ప్రాంతాలలోని అన్ని గురుకుల పాఠశాలల్లో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించి అవినీతికి పాల్పడిన వారిని ఉద్యోగం నుండి తొలగించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పవార్ కిరణ్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

బార్ అధ్యక్షుడికి మౌనిష్‌రెడ్డి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా వరుసగా నాలుగోసారి ఎర్రాల నగేష్ ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఆశన్న యాదవ్, సురేందర్ రెడ్డి, అతర్వ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేద కుటుంబాలకు అండ

నవతెలంగాణ-భైంసా

ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో కామోల్, పెండ్‌పెల్లి, కుంసరా గ్రామాలకు చెందిన ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద చెక్కులను అందించారు. కార్యక్రమంలో భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

నూతన డీఈఓకు రేవుపటీ సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నూతన జిల్లా విద్యాధికారిగా నియామకమైన ఎ.శ్రీనివాస్ రెడ్డిని రేవు పటీ ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి పరిచయం చేసుకుని శాలువతో సత్కరించారు. అనంతరం పలు విద్య సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అరుగుల స్వామి, అధ్యక్షులు ముస్కు స్వామి, ప్రధాన కార్యదర్శి అంపెల్లి లక్ష్మి నారాయణ, ఉపాధ్యక్షులు బండి అశోక్, సంఘం బాధ్యులు ఓ.రమేష్, ఏ.మురళి, చంద్రకాంత్, కిరణ్, సాయి కృష్ణ, శివ రామకృష్ణ ఉన్నారు.

ఫూలే జయంతిన ఆకాశవాణిలో సుకుమార్ ప్రసంగం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రముఖ సంఘసంస్కర్త, సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిబాఫూలే 198వ జయంతిని పురస్కరించుకొని ఈనెల 11 శుక్రవారం ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ద్వారా సుకుమార్ పెట్కులే ప్రసంగం ఉంటుందని ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్ర డైరెక్టర్ కె.రామేశ్వర్ పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు విద్యావృద్ధి, మహిళా సాధికారికత కోసం చేసిన కృషి ఇతర సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో ఫూలే దంపతులకు లభించిన గౌరవం, మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే చేస్తున్న సాహితీ సేవ, ఉమ్మడి జిల్లాలో పులే దంపతుల విగ్రహాల ప్రతిష్టాపన గురించి విశ్లేషణాత్మక వివరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమం ఉదయం 7 గంటల 20 నిమిషాలకు ఆకాశవాణి ఆదిలాబాద్ 100.2 ఎఫ్.ఎం ద్వారా దీన్ని వినవచ్చని తెలిపారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



ఆదిలాబాద్ టౌన్ : కేఆర్కే కాలనీలో నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను రూ. 50 పెంచడాన్ని ఖండిస్తున్నామని, పెంచిన ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. గ్యాస్ ధర పెంపుదలను నిరసిస్తూ బుధవారం పట్టణంలోని కేఆర్కే కాలనిలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కాలనీవాసులుతో కలిసి గ్యాస్ బండతో నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరలు పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల నడ్డివిరుస్తుందని మండిపడ్డారు. కార్పొరేట్ బడావ్యాపారుల కోసం తాపత్రయ పడే బీజేపీ ప్రభుత్వానికి పేదల గురించి పట్టడం లేదన్నారు. గ్యాస్ సబ్సిడీ సైతం తొలగించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల, నాయకులు కే.ఆశన్న, నగేష్, ఆరిఫా బేగం, కాలనీవాసులు మహేశ్వరీ, రేఖ, రుక్సాన, అనసూయ పాల్గొన్నారు .

సీపీఐ ఆధ్వర్యంలో..

రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ పై సబ్సిడి ఇస్తుంటే అదే కేంద్రం ప్రభుత్వం ప్రజలపై భారం వేసేల ధరలు పెంచుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డిజీల్ ధరలను నిరసిస్తూ బుధవారం పార్టీ కార్యాలయం ఎదుట గల రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఖాళీ సిండర్ పెట్టి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేదలకు గ్యాస్‌పై సబ్సిడి ఇస్తుందన్నారు. అదే కేంద్రంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ పేదలపై భారం వేసేల వంట గ్యాస్ ధరలను పెంచిందన్నారు. చరిత్రలో ఎన్నడు లేని విధంగా రూ.50 పెంచిందన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నళినిరెడ్డి, కుంటాల రాములు, అమీన ఉన్నారు.

నిర్మల్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచిన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట గ్యాస్ సిలిండర్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ ధర రూ.876 నుండి రూ.905కి పెరగడం వలన పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇంధన ధరలను నియంత్రించకుండా కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం మితిమీరిన ధరలు వేసి ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు. అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు తగ్గుతున్న దేశీయంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గకపోవడం దారుణమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్న ఈ పరిస్థితుల్లో గ్యాస్ ధర పెంపు ప్రజలను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తోందన్నారు. పెంచిన ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోకపోతే, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫసిఉద్దీన్, పోశెట్టి, శంబు, డాకూర్ తిరుపతి, మురళి, మజీద్, పంద్రం ఆనంద్ రావు, విజయ్, సంతోష్, సోమేశ్ పాల్గొన్నారు.



నిర్మల్ : జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం) నాయకులు

రాంజీగోండ్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ఆదివాసుల హక్కులతో పాటు నైజాం, బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించిన మహావీరుడు రాంజీగోండ్‌ను స్ఫూర్తిగా తీసుకుంటు హక్కుల సాధనకు ముందుకు సాగాలని బీజేపీ శాసనసభ పక్ష నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రాంజీ గోండు 165వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు చైన్ గేట్‌లో గల రాంజీగోండు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంజీ గోండు పోరాటపటిమను గుర్తుచేసుకుంటూ ఆయన నాయకత్వంలో ఏకకాలంలో అటు ఆంగ్లేయులు, ఇటు నైజాం పాలకులతో పోరాటం సాగించిన గొప్ప వీరుడు రాంజీగోండు అని కొనియాడారు. నిర్మల్ గడ్డపై పోరాడి ప్రాణత్యాగం చేసిన రాంజీ గోండు సహా వెయ్యిమంది వీరులను ప్రతీ ఒక్కరు స్మరించుకోవాలన్నారు. వారి త్యాగాలను స్ఫూర్తిని ముందు తరాలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : కావేరి గ్రంథాలయంలో బుధవారం రాంజీ గోండ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి పాల్గొన్న ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా.కృష్ణంరాజు మాట్లాడుతూ విదేశీ పాలకుల అరచకానికి, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేఖంగా పోరాడిన వీరుడు రాంజీగోండ్ అన్నారు. ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, రాంజీ మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాంజీగోండ్ స్మారక సమితి కన్వినర్ డా.అప్పాల కావేరీ ఫౌడేషన్ కోఆర్డినేటర్ పోలీస్ భీమేశ్, లైబ్రరీయన్ దీపక్ రెడ్డి, రాజమణి, విశాల్, అరణ్, యోగేష్, శ్రీధర్, రతీష్, కైలాష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆదివాసుల హక్కులతో పాటు స్వరాజ్యం కోసం మావనటే మావ రాజ్ నినాదంతో ఉద్యమించిన వీరుడు రాంజీగోండ్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మర్సుకోల పరివార్ సభ్యులు జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం బస్టాండ్ సమీపంలో రాంజీగోండ్ విగ్రహం వద్ద ఆయన వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంజీగోండ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆదివాసుల హక్కుల కోసం బ్రిటిష్, నిజాం, మరాఠ సరాజ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన వీరుడు రాంజీగోండ్ అని జ్ఞానేశ్వర్ తెలిపారు. ఆయన చేసిన ఉద్యమాల స్ఫూర్తితో ఇంద్రవెల్లి పోరాటం, కుమురం భీం ఉద్యమించారన్నారు. ఆదివాసుల హక్కుల సాధనలో ఆసువులు బాసిన ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడంతో పాటు పోరాటలను తెలియజేసేల చరిత్రను పాఠ్య పుస్తకాల్లో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బస్టాండ్ వద్ద కూడళికి రాంజీగోండ్ కూడలిగా నామకరణం చేయాలన్నారు. కార్యక్రమంలో మర్సుకోల పరివార్ సభ్యులు అశోక్, మాజీ ఎంపీటీసీ సోమన్న, ఆదిలాబాద్ రూరల్ మాజీ వైస్ ఎంపీపీ జంగు పటేల్, కోలాం సేవ సంఘం అధ్యక్షుడు కోడప సోనేరావ్, మర్సుకోల జైతు, కేశవరావ్, వెంకటేష్ పాల్గొన్నారు.



నిర్మల్ : రాంజీగొండ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

విక్రయించకుండా వినియోగించుకోవాలి

- కలెక్టర్ రాజర్షి షా • గిరిజన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం



నవతెలంగాణ-తలమడుగు

ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సన్న బియ్యాన్ని విక్రయించకుండా వినియోగించుకుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మండలంలోని ఝరి గ్రామంలో వివిధ కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని గిరిజన కుటుంబమైన పెందుర్ యాదవ్ ఇంట్లో సన్న బియ్యంతో వండగా వారితో కలిసి భోజనం చేశారు. జిల్లాలో తొమ్మిది రోజుల్లో 70 శాతం సన్న బియ్యం పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సన్న బియ్యం పేదలకు ఒక వరం లాంటిదని, అన్నం రుచికరంగా ఉంటుందన్నారు. అధిక డబ్బులు వెచ్చించి బియ్యాన్ని బయట కొనుగోలు చేయకుండా ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని అమ్ముకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నాణ్యత గల సన్న బియ్యం పంపిణీపై ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అదన కలెక్టర్ శ్యామల దేవి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజిద్, సివిల్ సప్లయి మేనేజర్ సుధా, తహసీల్దార్ రాజ్ మోహన్, డీఆర్‌డీఓ రవిందర్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐటీఐ పరీక్షలకు దరఖాస్తులు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో పని చేస్తున్న అర్హులైన అభ్యర్థులు ప్రయివేటుగా ఐటీఐ పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వినర్, ప్రభుత్వ ఐటీఐ కమ్మర్పల్లి ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ట్రేడుల్లో అభ్యర్థులు ముడేండ్లకుపైగా అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. సంబంధిత సంస్థలలో అనుభవం కలిగిన ధ్రవీకరణ పత్రం పొంది వరంగల్ జిల్లా ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ బాయ్స్ క్యాంపస్‌లో గల ప్రాంతీయ ఉప సంచలకులు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అక్కడ రూ.100 చెల్లించి దరఖాస్తు పొందాలని సూచించారు. ఈ నెల 7 నుంచి దరఖాస్తులు అందిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 12లోగా అందించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారానికి సెల్ నంబర్ 9491566890కు సంప్రదించాలన్నారు.

సదర్మాట్ ఆయకట్టు రైతుల ధర్నా



నవతెలంగాణ-కడెం

మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ చౌరస్తా వద్ద సదర్మాట్ ఆయకట్టు రైతులు బుధవారం నిరసన చేపట్టారు. రోడ్డుపై ధర్నా నిర్వహించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని లింగాపూర్, మసాయిపేట్, ఎలగడప, నచ్చన్ ఎల్లాపూర్, సారంగాపూర్, మల్లన్నపేట్, పాతమద్దిపడగ గ్రామాల రైతుల పంటలు చివరి దశకు వచ్చాయని సదర్మాట్ కాలువకు సాగునీటి విడుదల నిలిపేయద్దని డిమాండ్ చేశారు. సదర్మాట్ కాలువకు నీరు తక్కువగా వస్తున్నాయని నీటి విడుదల నిలిపివేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్ ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఫలితం లేకపోగా ఎస్సై ఫోన్ నుండి ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు ఫోన్ చేసి రైతులతో మాట్లాడించగా ఈనెల చివరి వరకు సాగునీటిని విడుదల చేస్తామని అవసరముంటే మరో రెండు తడులకు అదనంగా నీటి విడుదలకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

అన్యాక్రాంతమవుతున్న స్థలాన్ని పరిరక్షించాలి



నవతెలంగాణ-నిర్మల్

అన్యాక్రాంతమవుతున్న స్థలాన్ని పరిరక్షించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటగారి సాయన్న అన్నారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో భీమన్న గుట్టలో గల 63 ఎకరాల స్థలం అన్యాక్రాంతం అవుతుందన్నారు. ఎన్నో ఏళ్ల నుండి ముదిరాజుల ఆరాధ్యదైవం భీమన్న క్షేత్రం అక్కడ ఉందని, దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ముదిరాజ్‌లపై ఉందన్నారు. కులస్తులందరూ అందరూ ఐక్యంగా ముందుకు వెళ్లాలని, కులస్తులకు కేటాయించిన స్థలాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకరి సాయి, జిల్లా అధ్యక్షులు పాతర్ల గణేష్, సభ్యులు సుంకరి రాజేష్, ఉమామహేశ్వర్, దాసరి శంకర్, సుంకరి ఆనంద్, బోదారపు నరేష్, నేముల శ్రీనివాస్, సుంకరి శ్రీనివాస్, వన్నెపిన్నే కృష్ణ, సుంకరి చరణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సరుకులు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని క్రాంతినగర్ కాలనీకి చెందిన తరుణ్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి బృందం బుధవారం ఆయన నివాసానికి వెళ్లారు. ఈ సందర్భగా పరామర్శించి, వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఒక నెలకు సరిపడా సరుకులను కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆశన్న యాదవ్, గోవర్దన్ రెడ్డి, అతర్వ ఉన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎస్ఏ-2 పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డీఈఓ రామారావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుండి 17 వరకు పరీక్షలను నిర్వహించి పరీక్షానంతరం మూల్యాంకనం చేసి మార్కులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఈనెల 23న పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థుల ఫలితాలను అందజేయాలని తెలిపారు.

వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీ

నవతెలంగాణ-కడెం

మండలంలోని పాండ్వాపూర్ హనుమాన్ టెంపుల్ నుండి పెద్దూర్ టెంపుల్ వరకు బజరంగ్ దల్ ఆధ్వర్యంలో శ్రీరాముని, హనుమాన్ విగ్రహాలతో హనుమాన్ స్వాములు, భక్తులు, యువకులు బుదవారం వీరహనుమాన్ విజయ యాత్ర ర్యాలీ నిర్వహించారు. మహిళల మంగళహారతులు, డీజే హనుమాన్ పాటల మధ్య మండల హిందూ బంధువులు, హనుమాన్ దీక్షపరులు పాల్గొన్నారు. శ్రీరాముని నామస్మరణతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, యాత్ర వ్యవస్థాపక అధ్యక్షులు రవీందర్ గౌడ్ వివిధ పార్టీల నాయకులు హనుమాన్ భక్తులు, యువకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సిర్పూర్ మండలం దోర్పెల్లి గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ మండల వైస్ చైర్మన్, ధోర్‌పెల్లి అధ్యక్షుడు దుర్గం మధుకర్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దుర్గం మధుకర్ మాట్లాడుతూ తమ గ్రామం, మండల అభివృద్ధికి బీఆర్ఎస్‌లో చేరామన్నారు. కార్యక్రమంలో సిర్పూర్ మండల కన్వీనర్ అస్లాం బిన్ అబ్దుల్లా, నాయకులు పనసా లక్ష్మణ్, ఎల్ములే నందాజి, దుర్గం భారత్, దుర్గం వికాస్ రాజ్, షోఫీ పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

నవతెలంగాణ ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం నెలవారి తనిఖీలు భాగంగా జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం, రక్షణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా 24 గంటల పాటు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సునీల్, నాయక్ తహసీల్దార్ శ్యామ్‌లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

- రూ.70 వేల నగదు అపహరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ రహదారిలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయ రహదారిలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉద్యోగిని కొలిపాక వరలక్ష్మి మంగళవారం అత్యావసర పని నిమిత్తం తన కుమార్తె గ్రామమైన కెరమెరి మండలానికి వెళ్లారు. బుధవారం ఉదయం వరలక్ష్మి కోడలు కవిత గమనించగా కాంపౌండ్ వాల్‌కు సంబంధించిన గేట్లకు వేసిన తాళాలు అలాగే ఉండగా ప్రధాన ద్వారం తలుపులకు సంబంధించిన బెడం పగలగొట్టి ఉంది. భయభ్రాంతులకు గురైన ఆమె కోడలు కవిత వెంటనే తన అత్త వరలక్ష్మికి ఫోన్‌లో సమాచారం అందించగా ఆమె చేరుకుని ఇల్లు చిందరవందరగా పడి ఉండడాన్ని చూసి అవాక్కయ్యారు. అత్యావసర పనుల నిమిత్తం బీరువాలో దాచిన రూ.70 వేల నగదు కనిపించకుండా పోయేసరికి బోరున విలపించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సీఐ రవీందర్ అక్కడికి చేరుకొని చోరీకి సంబంధించిన వివరాలతో పాటు ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. బాధితురాలు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓంకార ఆశ్రమం హుండీ లెక్కింపు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కర్జెల్లి ఓంకార ఆశ్రమంలో శ్రీరాముల వారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా భక్తులు విరాళాలతో పాటు హుండీని ఆశ్రమం కమిటీ ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.13,140, చదివింపులుగా వచ్చినవి రూ.68,500 రాగ, అన్నదానం కోసం 8 గంటల బియ్యంతో పాటు రూ.80,000 ఓంకార ఆశ్రమానికి శ్రీరాముల కళ్యాణ మహోత్సవానికి మొత్తం రూ.201640 దాతలు సహకరించి అందించినట్లు ఓంకార ఆశ్రమ స్వాములు శివరాం తెలిపారు.

రాజీవ్ యువ వికాసంపై ప్రచారం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హత గల మైనారిటీలు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ నదీమ్ ఖుద్దుసి తెలిపారు. సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో అర్హత గల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని ప్రజా పాలన కేంద్రాలలో సంబంధిత ధ్రువపత్రాల నకలు ప్రతులతో దరఖాస్తు చేసుకోనే విధంగా అర్హులకు ప్రేరణ కలిగించాలన్నారు. రూ.50 వేల వరకు ఖర్చయ్యే యూనిట్లకు ప్రభుత్వం 100 శాతం రాయితీ, రూ.50 వేల రూపాయల నుంచి రూ.1 లక్ష వ్యయంతో కూడిన ప్రాజెక్టులకు 90 శాతం రాయితీ, రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, రూ.2 లక్షల నుండి 4 లక్షల వరకు ఉన్న యూనిట్లకు 70 శాతం రాయితీని తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ లోగా మండలాలలోని ప్రజాపాలన కేంద్రాలలో దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎల్పి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోనే ఉంటాం



నవతెలంగాణ-తిర్యాణి

అధికారంలో లేకున్న మండల ప్రజలకు ఎప్పుడు అందుబాటులోనే ఉంటామని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు హనుమండ్ల జగదీష్ అన్నారు. బుధవారం గంభీరావుపేట గ్రామానికి చెందిన మల్లేష్‌ను పరామర్శించి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు, మండల ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, నాయకులు ముత్యం రాజయ్య, గాడిపెల్లి అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నవకార్ మహామంత్ర దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రపంచ నవకార్ మహామంత్ర దినోత్సవాన్ని బుధవారం ఆసిఫాబాద్‌లోని జైన దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్‌లోని జైన సమాజానికి చెందిన మహిళలు, పురుషులు, బాలురు, బాలికలు జైన ఆలయంలో నవకార్ మహామంత్రాన్ని జపించారు. ఈ కేంద్ర జైన ప్రార్థన లోతైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను జరుపుకోవడానికి, దాని సార్వత్రిక విలువలను ప్రోత్సహించడానికి, వ్యక్తిగత, సామూహిక శ్రేయస్సు, శాంతి కోసం దాని జపాన్ని ప్రోత్సహించడానికి ప్రపంచ నవకార్ మహామంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఓపెన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జిల్లాలో ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్డీఓ లోకేశ్వర్ రావులతో కలిసి పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రకటించిన కార్యాచరణ ప్రకారం ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రతి రోజు 2 పేపర్లు ఉంటాయని, 10వ తరగతి పరీక్షలకు ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, ఫర్నిచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆర్టీసీ శాఖ అధికారులు విద్యార్థులకు సమయానుకూలంగా బస్సులు నడిపించాలని, గ్రామీణ నీటి సరఫరా అధికారులు పరీక్ష కేంద్రాలలో తాగునీటి ఏర్పాట్లు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. మున్సిపల్ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, పరీక్ష పేపర్లు పూర్తి బందోబస్తు మధ్య తరలించాలని, జవాబు పత్రాలను తపాలా శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని, ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ఇందులో పరీక్షల కమిషనర్ ఉదయ్ బాబు, డీఎంహెచ్ఓ సీతారాం, రవాణ శాఖ అధికారి రామచందర్, విద్యుత్ శాఖ అధికారి శేషరావు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పోడు రైతుల జోలికొస్తే ఖబడ్దార్ : ఆర్ఎస్‌పీ



రైతులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-చింతలమానేపల్లి

పోడు రైతుల జోలికి అటవీ శాఖ అధికారులు వస్తే ఉరుకొబోమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కర్జెల్లి గ్రామ రైతులతో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ అధికారులు, పోడు భూములను దున్నుకోవడానికి అడ్డగిస్తున్నారని, కేసీఆర్ ప్రభుత్వం పోడు భూములపై పట్టాలిచ్చి హక్కులు కల్పించిన ఆ భూములపై ట్రాక్టర్లతో దూకి దున్నొద్దని పలు విధాలుగా అడ్డంకులు సృష్టిస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్ట భూములను సైతం ఆదివాసులను వ్యవసాయం చేసుకోకుండా అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. రైతులు ఎవరు కూడా భయ పడవద్దని, ఇలాంటి సమస్య సిర్పూర్ నియోజకవర్గం వ్యాప్తంగా ఉందని ఈ సమస్య ఎదుర్కొంటున్నారని అన్నారు. మండలంలోని దింద, గూడెం, కోయపెల్లి, కోర్సిని, ఆడేపెల్లి, బెజ్జూరు మండలంలోని నందిగూడ, పాపాన్‌పేట్ లాంటి గ్రామాల్లో ఈ సమస్య ఉందన్నారు. రైతులు వారి ప్రధాన జీవనాధారమైన వ్యవసాయం చేసుకోకుండా ఇబ్బంది చేయడం సరికాదన్నారు. రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కాశీపక రాజు, రామాటేంకి నవీన్, మహిళా నాయకులు తాండ్ర వరలక్ష్మి పాల్గొన్నారు.

రాంజీ గోండ్‌కు ఘన నివాళి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ : రాంజీగోండ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

రాంజీగోండ్ పోరాట స్ఫూర్తితో ఆదివాసీ సమస్యల పరిష్కారానికి పోరాడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కోరెంగా మాల శ్రీ అన్నారు. ఆదివాసీ ముద్దుబిడ్డ మర్సకోల రాంజీ గోండ్ 164వ వర్ధంతి ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ స్వాతంత్రం కోసం జరిగిన తొలి పోరాటాలలో అనేకమంది ఆదివాసులు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, రాచరిక పాలన వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. భారతదేశంలో ఆంగ్లేయుల ఆధిపత్యం అణచివేతకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు నడిపిన చరిత్ర ఆదివాసులదనీ అన్నారు. స్వయంపాలన కోసం, ఆత్మగౌరవం కోసం, పరాయి పాలనను వ్యతిరేకించటం ఆదివాసులకు మొదటి నుండి వెన్నతో పెట్టిన విద్యగా ఉందన్నారు. ఈ తిరుగుబాటు పోరాటాల నుంచి వారసత్వంగా ఆదిలాబాద్ అడవితల్లి ఒడి నుంచి ఆవిర్భవించిన ఆదివాసీ విప్లవ జ్వాలే రాంజీగోండ్ అని అన్నారు. ఏజెన్సీ అరణ్యంలో ఉన్న సహజ సంపద, ఖనిజ వనరులను బహుళజాతి కంపెనీలకు దొడ్డిదారిలో ఇష్టారాజ్యంగా, చట్టవిరుద్ధంగా దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఆదివాసులను నిలువుగా నిర్వాసితులను చేస్తున్నారని దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయడమే ఆయనకు మనమే ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, నైతం రాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టికానంద్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ చాపిడి శ్రావణి పాల్గొన్నారు.

తిర్యాణి : రాంజి గోండ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదివాసీ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు కొట్నాక ప్రవీణ్ అన్నారు. రాంజీ గోండ్165 వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం రాంజీ గోండ్ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల్లో కూడా ఎంతోమంది ఉద్యమకారులున్నారని, అందులో రాంజీ గోండ్ ప్రత్యేకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రుక్మిణి, ఆదివాసీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గేడం జనార్ధన్, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు వేడ్మ భగవంతురావు, తుడుం దెబ్బ ప్రధాన కార్యదర్శి గేడం సుభాష్, ఆదివాసి విద్యార్థి సంఘం నాయకులు మర్సకోల అశోక్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కెరమెరి : ఆదివాసుల తొలి ఉద్యమవీరుడు మర్సుకోల రాంజీగోండ్ ఆశయ సాధనకు కృషి చేయాలని పెందూర్ శ్యాం రావు సేవా సమితి వ్యవస్థాపకులు పెందూర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాంజీగోండ్ 165వ వర్ధంతిని సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విరోచితంగా పోరాడిన వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు రాంజీ గోండ్ అని కొనియాడారు. ఇందులో సకారాం, ఆత్రం భీంరావు, కుడ్మేత భీంరావు, అడ శ్రీనివాస్, మెస్రం వసంత్‌రావు పాల్గొన్నారు.

దేశంలో నియంతృత్వ పాలన : కాంగ్రెస్

నవతెలంగాణ-చింతలమానేపల్లి



చింతలమానేపల్లి : యాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేశంలో నిత్యత్వ పాలన సాగుతోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జైబాపు, జై భీమ్, జై సంవిధన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఉమా మహేష్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో అప్రజాస్వామిక నియంతృత్వ పాలన కొనసాగిస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాలతో పాలన సాగిస్తున్న బీజేపీ విధానాలను ఎండగట్టాలన్నారు. నిండు పార్లమెంట్ సభలో కేంద్ర మంత్రి అమిత్ షా బాబాసాహెబ్ అంబేద్కర్‌ని అవహేళన చేస్తూ మాట్లాడారన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు లోడేల్లి ప్రవీణ్, జునగారి శేఖర్, ఇప్ప శ్రీనివాస్, కొండు శంకర్, దస్తగిరి పాల్గొన్నారు.

తిర్యాణి : మండలంలోనిమొర్రిగూడ, ఏదులపాడు, కన్నెపల్లి, గోయిగాం, తలండి, నాయకపుగూడ, గడలపల్లి, గంభీరావుపేట్ గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలాధ్యక్షుడు చిత్తారి సాగర్, కోఆర్డినేటర్ దుర్గం రవీందర్ ఆధ్వర్యంలో యాత్రను నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పెరుమళ్ళ వెంకటేష్ గౌడ్, బొల్లం శంకర్, బుద్దే విజయ్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు మేడిశెట్టి శంకర్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పడగల అమర్, బుద్దె చిన్నయ్య, బానయ్య, చుంచు బాపూరావు, మాజీ సర్పంచ్ తుమ్మరం గోపాల్, దురిశెట్టి సతీష్, ఎదుల శీను, పులి కొమురయ్య, కోర్వి రాహుల్ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెంచిన ధరలు తగ్గించాలని కోరుతూ ఖాళీ గ్యాస్ సిలిండరులతో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. ఇప్పుడు పెరిగిన గ్యాస్ ధరల ఫలితంగా రాష్ట్రంపై రూ.400 కోట్ల భారం పడుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గుతుంటే కూడా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దారుణమన్నారు. 2014తో పోలిస్తే ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారాల్ ముడి చమురు ధర చాలా తగ్గిందని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వ నాటకాలను ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తీక్, కోరెంగ మాలశ్రీ, గేడం టికానంద్, నాయకులు శ్రావణి పాల్గొన్నారు.

24న పీపుల్స్ ప్రొగ్రెసివ్ ట్రస్ట్ టాలెంట్ టెస్ట్

- టీఎస్‌యూటీఎఫ్ వెల్లడి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న పీపుల్స్ ప్రొగ్రెసివ్ ట్రస్టుకు సంబంధించిన టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి వెల్లడించారు. బుధవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె టెస్ట్‌కు సంబంధించిన వివరాలను విడుదల చేశారు. ఆసిఫాబాద్‌లో ఉదయం 9-30 గంటలకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 4, 5, 6వ తరగతి విద్యార్థులకు ఈ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న తరగతికి సంబంధించిన తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టుల నుండి 20 ప్రశ్నల చొప్పున మొత్తం 80 ప్రశ్నలు, 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ప్రాతిపదికన వెయ్యి మందిని ఎంపిక చేస్తారని, ఎంపిక క్రమంలో మార్కులతో పాటు అనాథ పిల్లలు, తల్లి గాని, తండ్రి గాని లేని పిల్లలు, నిరుపేద కుటుంబాల పిల్లలకు ప్రాధాన్యత కల్పిస్తారని తెలిపారు. ఐదో తరగతి నుండి డిగ్రీ వరకు వందలాది మంది విద్యార్థులకు హాస్టల్ సౌకర్యంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనాథ పిల్లలు విద్యకు దూరమయ్యే పరిస్థితి రాకుండా ఉండాలనే ఒక మంచి ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న ఈ టాలెంట్ టెస్ట్‌కు ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యేలా ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రయత్నం చేయాలని ఆమె కోరారు. పరీక్ష కోసం దరఖాస్తులు ఆన్‌లైన్ గూగుల్ ఫాం ద్వారా పొందాలని, ఈ నెల 18 సాయంత్రం ఎనిమిది గంటలలోగా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9908288738, 9347255489, 9052875454 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు రాజకమలాకర్‌రెడ్డి, బాజీఖాన్, జహీర్, చాపిలె సాయికృష్ణ పాల్గొన్నారు.

డీఎండబ్ల్యూఓకు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీఎండబ్ల్యూఓగా బాధ్యతలు స్వీకరించిన నదీంను ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. మైనార్టీ సంక్షేమమం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఉబైద్ బిన్ యహియా(తరీఖ్) సభ్యులు మీర్ సాబిర్ అలీ హష్మీ, అబ్దుల్ ముబాషీర్, ఎజాజ్ హైదర్, ముస్తఖీం పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని సలుగుపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మొగుడ్‌దగడ్, సోమిని, సలుగుపల్లి కాంప్లెక్స్‌ల సమావేశం ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏసీఎంఓ ఉద్దవ్ మాట్లాడుతూ ఎస్ఏ-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చూడాలన్నారు. పాఠశాలలోని రిజిస్టర్లను సరిగ్గా ఉంచాలన్నారు. పై తరగతులకు వెళ్లే విద్యార్థులను దగ్గరలోని ఆశ్రమోన్నత పాఠశాలలో చేర్పించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలన్నారు.ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏటీడీఓ కమర్ హుస్సేన్, ఎస్ఆర్పీ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రంలోని కార్మల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఎస్ఎస్‌సీ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు బుధవారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఎండాకాలంలో ఎదురయ్యే వేడిని తట్టుకునేందుకు విధులు నిర్వహిస్తున్న 700 మంది ఉపాధ్యాయులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డీఈఓ యాదయ్య చేతుల మీదుగా ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆసం పల్లి రమేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోతే జయకృష్ణ, ఉపాధ్యక్షుడు కుమార్, కార్యదర్శిలు ప్రకాష్, సురేష్ రాష్ట్ర కౌన్సిల్ జాకీర్, విష్ణువర్ధన్, శ్రీనివాస్, ఆంజనేయులు, వెంకటేష్, గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా రాంజీ గోండ్ 165వ వర్ధంతి

నవతెలంగాణ-జన్నారం



ఆదివాసీ హక్కుల పోరాట సంఘం, నాయకుడు ప్రథమ స్వతంత్ర పోరాట యోధుడు రాంజీ గోండు 165వ వర్ధంతిని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ మండల అధ్యక్షుడు రాయసీండం కాశీ మాట్లాడుతూ రాంజీ గోండు ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఆదివాసీలంతా ఐక్యంగా ఉండి పోరాటం చేస్తేనే తమ హక్కులను సాధించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మండాడి ననేశ్వర్, రాయిసెంటర్ మేడి పూసం సోనేరావు, మండాడి బాగువంత్ రావు, రాయి సిడం జ్యోతిరం, పంద్ర శ్రీనివాస్, ఆత్రం ఇంద్రు పటేల్, ఊర్వేత ధర్ము పటేల్, ప్రసాద్, అరవింద్ పాల్గొన్నారు.

మూల్యాంకనం పారదర్శకంగా చేపట్టాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

10వ తరగతి పరీక్షలకు సంబంధిత జవాబు పత్రాల మూల్యాంకనం పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలోని కార్మల్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి పక్షపాతం చూపకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో 10వ తరగతి పునాది వంటిదని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించి ఆర్‌డీఓ శ్రీనివాసరావుతో కలిసి 163 జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితుల వివరాలను పరిశీలించారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం

- ఏరియాలో 40వ శిబిరంతో 2856 యూనిట్ల దానం



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి వృత్తి శిక్షణా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా నూతనంగా ఉద్యోగం పొందిన కార్మికులు, వివిధ గనుల డిపార్ట్మెంట్ ఉద్యోగులు స్వచ్ఛందంగా తరలి వచ్చి రక్తదానం చేశారని తెలిపారు. ఏరియాలో ఇది 40వ రక్తదాన శిబిరం అన్నారు. ఇప్పటివరకు 2856 యూనిట్లను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ గుండేటి శంకర్‌ని ప్రత్యేకంగా అభినందించారు. ఏరియా తరఫున ఎల్లప్పుడూ తల సేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరాలు నిర్వహించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం రక్తదాతలకు ప్రశంస పత్రాలను ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, వృత్తి శిక్షణ మేనేజర్ శంకర్, ట్రైనింగ్ అధికారి అశోక్ కుమార్, హెడ్ ఓవర్మెన్లు రాజేశం, రఘువరన్, గురుమూర్తి, పీహెచ్‌సీ వైద్యులు రమేష్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 12న జన్నారం మండల కేంద్రంలోని ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్య జాన్సన్ నాయక్ విడుదల చేశారు. ఈ ఉత్సవాలకు రావాలని జాన్సన్ నాయకులు నేతకాని మహార్ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాయిని ప్రసాద్ నేత మాట్లాడుతూ ఈ మహనీయుల ఉత్సవాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలను ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ, కులమతాలకు అతీతంగా అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఏప్రిల్ నెలలో భారతదేశ సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసిన మహనీయుల జయంతి వేడుకలు ఉండడం, వారందరి జయంతులను ఒకే వేదిక మీదిగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జాడి గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఒల్లాల నర్సాగౌడ్, జంగం సంతోష్, నేతకాని కుల సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, ఎస్‌సీటీ సంస్థ సభ్యులు మంతెన వెంకటేష్, పొండేటి సతీష్, అల్లూరి వినోద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వాడ

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని గుళ్ళకోట-2, ఉత్కూర్-3 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని రెండవ రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. గృహ సందర్శనల ద్వారా ప్రసవానంతరం ముర్రుపాల ప్రాముఖ్యత, 6 నెలల వరకు కేవలం తల్లి పాలు ఇవ్వడం ఆవశ్యకతపై అవగహన కల్పించారు. మొదటి 1000 రోజుల్లో పోషకాహారం ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజార్ మమత, టీచర్లు జ్యోతి, లత పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యం



మందమర్రి : పాదయాత్రలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-మందమర్రి

రాజ్యాంగ పరిరక్షణే ఏకైక లక్ష్యమని పెద్దపెల్లి ఎంపీ వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ స్పష్టం చేశారు. బుధవారం అంగడి బజార్ ప్రాంతంలో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ పార్లమెంట్‌ను బీజేపీ నియంతృత్వ పాలన సాగిస్తోందని విమర్శించారు. రాహుల్ గాంధీకి మాట్లాడే హక్కును బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు రాజ్యాంగానికి నష్టం కలిగించే కుట్రలు చేస్తుందని, వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికే పాదయాత్ర చేపట్టామని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు, రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత పార్టీ శ్రేణుల మీద ఉందన్నారు. మోదీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉంది అన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం జరిగిందని చెప్పారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మందమర్రిని పట్టించుకోలేదని, మున్సిపాలిటీలో అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సైడ్ డ్రైన్లు, రోడ్లు, కరెంట్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి సమయంలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్యాంకర్ల ద్వారా నీరు అందించామని గుర్తు చేశారు. కాకా వెంకటస్వామి కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు రూ.24 కోట్లతో గోదావరి నీటి పథకం కోసం కృషి చేసిన విషయం గుర్తు చేశారు. ఎంపీ వంశీకృష్ణ 30 కోట్లతో అమృత్ స్కీమ్ కింద తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చారని వివరించారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచడం ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందించే అవకాశం కల్పించామన్నారు.

లక్షెట్టిపేట : మండలంలోని కొత్తూరు, ఎల్లారం గ్రామాలలో పెద్ద ఎత్తున జై బాపు, జై భీమ్, జై సంవిధన్, రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చివరి రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామలలో జాతీయ జెండాను ఎగురా వేసి పాదయాత్రను ప్రారంభించారు. మండల అధ్యక్షుడు పింగళి రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కలసికట్టుగా పోరాడుదాం.. రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని, పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండ బుచ్చన్న, జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణచందర్ రావు, చెల్ల నాగభూషణం, చింత అశోక్ కుమార్, జిల్లా ఆర్‌టీఏ మెంబెర్ అంకతి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, జిల్లా అధికార ప్రతినిధి బియ్యాల తిరుపతి, యూత్ అధ్యక్షుడు బొప్పు సుమన్, కంది మోహన్, గుండ శ్రీనివాస్, సురేష్ నాయక్, అన్నం చిన్నాన్న పాల్గొన్నారు.



లక్షెట్టిపేట : పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పెంచిన గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి



జన్నారం ప్రధాన రహదారిపై కాళీ సిలిండర్‌తో నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-జన్నారం

వంట గ్యాస్ ధరల పెంపుకు వ్యతిరేకంగా బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ఖాళీ సిలిండర్‌తో నిరసన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల ప్రధాన కార్యదర్శి కనికరం అశోక్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధర, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, డిమాండ్ చేస్తున్నామన్నారు. మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై కూడా పెద్ద భారం పడుతుందని, మోడీ బీజేపీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని, కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. నిత్యవసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని, బీజేపీ ప్రభుత్వం ప్రగల్బాలు పలికి అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలపై పెంచిన గ్యాస్ ధర వల్ల ఏటా రూ.400 కోట్ల భారం పడుతుందని, పెంచిన వంటగ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని, ప్రజలందరూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు తెలుసుకొని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు కొండగుర్ల లింగన్న, కూకటికారు బుచ్చయ్య, మగిడి జయ, అంబటి లక్ష్మణ్, నారాయణ పాల్గొన్నారు.

కాసిపేట : బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచి పేదలపై అధిక భారం మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మహా లక్ష్మి పథకం కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం ధరలు పెంచడాన్ని తీవ్రంగా విమర్శించారు. గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు ఆమాంతంగా తగ్గుతుంటే కేంద్రం ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని వ్యతిరేకించారు.

విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు అందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు జూన్ మాసం మొదటి వారంలోగా పాఠశాలలకు కేటాయించిన మేరకు నాణ్యమైన ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, విద్యాశాఖ సమన్వయకర్త చౌదరిలతో కలిసి మండల విద్యాధికారులు, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య, మెప్మా సభ్యులతో ఏకరూప దుస్తుల తయారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి దిశగా అనేక చర్యలు చేపడుతుందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, వంటశాల, భోజనశాల, ప్రహరీగోడ ఇతర మౌళిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, మే నెల 20వ తేదీలోగా దుస్తులు సిద్ధం చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధించి దుస్తుల తయారీ కొరకు కొలతలు ఇప్పటికే తీసుకోవడం జరిగిందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీకి మహిళా స్వయం సహాయక సంఘాలకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు హైదరాబాద్‌లో అందించిన శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువ పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

వరి కోతల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

నవతెలంగాణ-మందమర్రి

బొక్కలగుట్ట గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల వ్యవసాయ అధికారి జి.కిరణ్మయి, విస్తరణ అధికారులు కనకరాజు, తిరుపతిలు యాసంగి వరి కోతల అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి వరి కోతల సమయం సమీపించినందున, పూర్తి పరిపక్వత చెంది, బాగా ఆరిన వరిని మాత్రమే కోతలు చేపట్టాలని, కోసే సమయంలో గింజలో తేమ శాతం కేవలం 14 నుంచి 17 శాతం మాత్రమే ఉండాలని, హార్వెస్టర్ యంత్రం బ్లోయర్ పంక వేగం 18 నుంచి 20 ఆర్‌పీఎం ఉండేట్లు జాగ్రత్తలు తీసుకోవాలని దీంతో తాలు, తప్ప లేని నాణ్యమైన ధాన్యాన్ని పొందవచ్చునని, కొనుగోలులో ఇబ్బందులు ఏర్పడవని తెలిపారు. ఎత్తైన ప్రదేశంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అకాల వర్షాలు వచ్చినప్పుడు కల్లాల్లోని ధాన్యం నీటిలో మునిగి తడవకుండా కాపాడుకోవచ్చని సూచించారు. రైతుకు కొనుగోలు పత్రం అందించాలని అదే విదంగా కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు నీడ, చల్లని తాగు నీరు, ఓఆర్ఎస్ పాకెట్స్, సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని వరి కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, కనకరాజులు వరి పంట ఉత్పత్తికి సరిపడ భూమి వివరం పత్రాలతో పాటు, ఆధార్ కార్డ్, బ్యాంక్ ఖాతా పుస్తకం తప్పనిసరిగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చినప్పుడే కేంద్రం నిర్వాహకులు దొడ్డు వడ్లు గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2320, గ్రేడ్-బి ధాన్యానికి రూ.2300 ఒక క్వింటాలుకు మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ.500 బోనస్ కూడా ఇస్తుందని రైతులకు తెలిపారు.

జన్నారం : యాసంగి వరి కోత సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని, మండలంలోని కవ్వాల్ సెక్టార్ ఎఇఓ అక్రమ్ అన్నారు. బుధవారం కవ్వాల్ సెక్టార్ పరిధిలోని రైతుల పంట పొలాలకు వెళ్లి పంట కోత పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు తేజవాత్ రమేష్, జునుగురి రాజన్న, కామెర బక్కన్న, హార్వెస్టర్ డ్రైవర్లు సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- నూతన రేషన్ షాపును ప్రారంభించిన ఆర్డీఓ హరికృష్ణ



నవతెలంగాణ-తాండూర్

సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో నూతన రేషన్ షాపును ప్రారంభించారు. సన్నబియ్యాన్ని పంపిణీ చేసిన అనంతరం గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించిన సన్న బియ్యాన్ని డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. సన్న బియ్యం పథకం గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. లబ్ధిదారులు సన్నబియ్యం అమ్ముకుంటే కార్డులు రద్దు చేస్తామన్నారు. నర్సాపూర్‌లో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్నారు. గిరిజన బాలికను అక్కున చేర్చుకొని అక్షరాభ్యాసం చేయించారు. మానవ వనరుల అభివృద్ధి, నవజాతి సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గిరిజన గ్రామాల్లో గర్భిణులు, బాలబాలికలు ఏ ఒక్కరు రక్తహీనతో బాధపడరాదన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని తెలిపారు. రక్తహీనత కేసులు నమోదు అయితే పర్యవేక్షణ అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, ఎస్ఐ సోజన్య, ఆర్ఐ ఎజాజుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి , ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సూరం దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కాపర్తి సుభాష్ పాల్గొన్నారు.

ప్రమాదరహిత సింగరేణిగా గుర్తింపు తేవాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రమాద రహిత సింగరేణిగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఎన్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సీసీసీ సింగరేణి గెస్ట్ హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బెల్లంపల్లి రీజియన్ భూగర్భ గనులలో రూఫ్ రక్షణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ కె ప్రేమ్ కుమార్, కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘు కుమార్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్, మందమర్రి జనరల్ మేనేజర్ దేవేందర్, బెల్లంపల్లి జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి, రెస్క్యూ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి తో కలిసి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన ప్రమాదాలపై సమీక్షించి, పునరావృతం కాకుండా తీసుకోవలసిన రక్షణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రూఫ్ లను కింద పడకుండా జాగ్రత్తగా కాపాడాలని, అలాగే సైంటిఫిక్ స్టడీ చేస్తూ ఎల్లవేళలా పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ఇన్ డ్యూస్ బ్లాస్టింగ్‌లో తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, సీఎంఆర్ 2017 ప్రకారం కోల్ మైన్స్‌కు సంబంధించిన అన్ని రూల్స్‌ను పాటిస్తూ, సపోర్ట్ ప్లాన్‌ను నిరంతరం పరిశీలిస్తూ, అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పనిలో ఆతృత అవసరం లేదని, స్టోవింగ్ మెటీరియల్ ఏర్పాటు చేసుకోవాలని, డీజీఎంఎస్ సర్క్యులర్ ప్రకారం అందరూ పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, బెల్లంపల్లి ఏరియా రక్షణాధికారి రాయమల్లు, ఏజెంట్లు కె రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్వర్యంలో మంచిర్యాల జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి జాడి పోషం అద్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడు శాతం సుమన్, ఉపాధ్యక్షుడు చీకటి సత్యనారాయణ పెద్ది శివ వర్ధన్, కార్యదర్శి పొనగంటి ఏసేపు, తదితరులను ఎంపిక చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని తెలిపారు. 1996లో సీపీఐ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సభ్యులు నమోదు చేయించి వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పించిందని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదు అయి ఉన్నారు. వీరందరి హక్కులు కాపాడుతూ సంక్షేమ బోర్డులో ఉన్న రూ.కోట్ల నిధులను ఇతర అవసరాలకు వాడకుండా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 13న మందమర్రి సీఈఆర్ క్లబ్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం మహా సభలు, ఏప్రిల్ 21, 22న రాష్ట్ర మహాసభలు రంగారెడ్డి జిల్లాలో ఉంటాయని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | ఏప్రిల్ 10, 2025 | www.navatelangana.com

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండల కేంద్రంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండల రైతులు ఎంపీ గోడం నగేష్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ మండల కేంద్రంలో జొన్న కొనుగోలు కేంద్ర ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న, మాజీ జెడ్పీటీసీలు మల్లెపూల నర్సయ్య, కొత్త శంకర్, రైతులు ఇర్ల శివుడు, డుబ్బుల చంద్రశేఖర్, లక్కం శంకర్, మేకల లింగన్న, కీర్తి చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో మరింత పటిష్టమైన షీ టీం బృందం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళలు చిన్నారులు ఎలాంటి భయాందోళనలు లేకుండా, ఎలాంటి సమస్యలున్నా ఆదిలాబాద్ షీ టీం బృందాన్ని సంప్రదించాలని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. బుధవారం పోలీస్ ముఖ్య కార్యాలయంలో షీ టీంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు, సూచనలు, సలహాలు చేశారు. సిబ్బందిని మరింత కేటాయించి ప్రస్తుత షీటీంనే మరింత పటిష్టం చేశామన్నారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులకు గురైతే వెంటనే ఆదిలాబాద్ షీ టీంను, షీటీం నం. 8712659953ను సంప్రదించాలన్నారు. ఫోన్, సోషల్ మీడియా పని ప్రదేశంలో వేధింపులకు గురైతే షీ టీం బందాలను సంప్రదించాలని పేర్కొన్నారు.

భర్తపై భార్య హత్యాయత్నం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తాళికట్టిన భర్తనే భార్య కడతేర్చాలని చూసిన సంఘటన మండలంలోని గోపాల్‌పూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై దుబ్బాక సునీల్ వివరాల ప్రకారం. మండలంలోని హీరాపూర్ పంచాయతీ పరిధి గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన లాండిగే సాహెబ్‌రావ్‌కి భార్య ఎల్లవ్వ, ఒక పాప ఉంది. వరుసకు పిన తమ్ముడైన చెట్ల దశరథ్ సాహెబ్‌రావ్ భార్యతో అక్రమ సంబంధం పెట్టుకోగా గమనించిన సాహెబ్‌రావ్ పలుమార్లు మందలించాడు. అయినా అతను తీరుమార్చుకోలేదు. ఇదిలా ఉంటే భార్య ఏల్లవ్వ, చెట్ల దశరథ్ అతనని చంపేందుకు పథకం పన్నారు. బుధవారం సాహెబ్‌రావ్ చేనులో వ్యవసాయ పనులు చేస్తుండగా చెట్ల దశరథ్, ఎల్లవ్వ ఇద్దరు కలిసి గొడ్డలితో ఆయన పై దాడి చేశారు. స్పృహ కోల్పోడంతో చనిపోయాడని భావించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అటుగా వెళ్లే వారు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. సాహెబ్‌రావ్ ఫిర్యాదు మేరకు చెట్ల దశరథ్, లాండిగే ఎల్లవ్వపై హత్యయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో నేరాల నియంత్రణకు, ప్రజల ఆస్తుల రక్షనే ప్రధాన లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం పనిచేస్తోందని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. నేరాల నియంత్రణ, గంజాయి నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బ్లూ కోర్ట్ సిబ్బంది పెట్రోలింగ్ సమయం లో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. రాత్రి 10:30 దాటితే హోటళ్లు, వైన్, బార్‌షాపులు, వ్యాపార సముదాయాలు బంద్ చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. నిరంతరం బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతూ అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరించాలని సూచించారు. రికార్డ్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు. ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురిపై కేసు



నవతెలంగాణ-ఉట్నూర్

గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ మొగిలి, ఎస్ఐ మనోహర్ మండలంలోని ఎక్స్‌రోడ్డు ప్రాంతంలో హరినాయక్ పెట్రోల్ బంక్ వద్ద తనిఖీలు నిర్వహించి పల్సర్ బైక్‌పై గంజాయి తీసుకొస్తున్న ముగ్గురుని పట్టుకున్నారు. వారిని విచారించగా ఆదిలాబాద్‌రూరల్ మండలం అసోద గ్రామం నుంచి జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలానికి గంజాయి పంపిస్తున్నట్లు కొమ్రా రాహుల్, ముండే అనిల్, తురగ గౌతమ్ తెలిపారు. వారి వద్దున్న 1.25 కిలో గంజాయినితో పాటు బైక్ స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-రెబ్బెన

హన్మకొండలో ఈ నెల 27న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సింగరేణి ఉద్యోగులు, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం గోలేటిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో సుమారు 20 వేల మందికి కారుణ్యం నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించిన ఘనత కేసిఆర్‌కే దక్కుతుందన్నారు. తమ అభిమానాన్ని చాటుతూ సభకు స్వచ్ఛందంగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇందులో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మంగీలాల్, కమిటీ నాయకులు ఓరం కిరణ్, మాంత్ సమ్మయ్య ఏరియా కార్యదర్శి అలవేణి సంపత్, ఫిట్ కార్యదర్శులు మెరుగు రమేష్, గాజువేని శ్రీనివాస్, కమిటీ సభ్యులు ముల్కల చంద్రయ్య పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు హ్యాండిల్ లాక్ తప్పనిసరి

నవతెలంగాణ-కడెం

ద్విచక్రవాహనాలకు హ్యాండిల్ లాక్ తప్పనిసరి వేయాలని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. బుధవారం బైక్‌ల చోరీ సందర్భాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పంట పొలాలు, రోడ్డు పక్కన ఎక్కడ బైక్ పార్క్ చేసినా హ్యాండిల్ లాక్ వేసి, తాళం బైక్‌లో పెట్టకుండా వెంట ఉంచుకోవాలన్నారు. మండలంలో గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నారని, ఎవరైనా అను మానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే బీజేపీ లక్ష్యం

నవతెలంగాణ-రెబ్బెన

అభివృద్ధి సంక్షేమమే బీజేపీ లక్ష్యమని బీజేపీ మండల అధ్యక్షుడు మాల్రాజ్ రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల బూతు స్థాయి క్రియాశీల కార్యకర్తల సమావేశంలో ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. పదేండ్లలో మోడీ ప్రభుత్వం సేవలు అభివృద్ధి, అందించిన ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణకుమారి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మి ఆంజనేయులుగౌడ్, మండల కన్వీనర్‌లు మల్లేష్, తులసీరాం, రాజిరెడ్డి, మధుకర్, కో-కన్వీనర్‌లు సచిన్ జైస్వాల్, నవీన్, సునీల్, దిలీప్, రఘురాం, రాంచందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంజీ గోండ్ ఆశయాలను కొనసాగిద్దాం



ఇంద్రవెల్లిలో రాంజీగోండుకు నివాళ్లు అర్పిస్తున్న గిరిజనులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

స్వాతంత్ర్య సమరయోధుడు మర్సకోల రాంజీగోండు ఆశయాలను నెరవేరుద్దామని ఆదివాసీ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంజి చౌరస్తాలో ఆయన 165వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. జెండాను ఆవిష్కరించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇందులో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, కోశాధికారి బారిక్‌రావ్, మడావి ఇంద్రు పటేల్, తులసిరాం పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : మావల మండలంలోని కొమురం భీమ్‌కాలనీలో తుడుం దెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాంజీగోండ్ 165వ వర్ధంతి ఘనంగా నిర్వహించి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ మాట్లాడుతూ భారత ప్రథమ స్వాతంత్ర్య పోరాటమంటేనే 1857 సిపాయిల తిరుగుబాటు గుర్తుకొస్తుందన్నారు. అలాంటి ఆపోరులో తెలంగాణ నేల సైతం భాగమైందని, అందులోనూ నిర్మల్ ప్రాంతం ప్రముఖంగా నిలిచిందన్నారు. బ్రిటిష్‌కు వ్యతిరేకంగా పోరాడిన రాంజీగోండ్ సహా వెయ్యిమంది వీరులు నిర్మల్‌లోని ఓ మర్రిచెట్టుకు ఉరితీయబడ్డారన్నారు. ప్రపంచ చరిత్రలోనే ఎక్కడా జరగని ఓ అతిపెద్ద ఘటన ఇదన్నారు. చరిత్రపుటల్లో ఎక్కడా దీని గురించి లిఖించకపోవడం శోచనీయమన్నారు. వారి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఇందులో ఆదివాసీ నాయకులు వేట్టి మనోజ్, సలాం వరుణ్, గోడం రేణుక, ఉయిక ఇంద్ర, గేడం విష్ణు గణపతి, వేడ్మ ముకుంద్, తోడషం ప్రకాష్, సిడాం ఆత్మారావు, కుంర గోవింద్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్ : మావలలో..



ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ : ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమించిన యోధుడు మర్సుకోల రామ్‌జీగొండ్ 165వ వర్ధంతి జిల్లాకేంద్రంలోని జానకాపూర్‌లోఎని రాంజీగొండ్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి త్యాగాలను స్మరించారు. కార్యక్రమంల్లో రాంజీగొండ్ వారసులు మర్సకోల తిరుపతి, రాయి సెంటర్ జిల్లా కోసాదికారి కుడ్మెత మారుతి, జీసీడీఓ శకుంతల, గోండు ఉద్యోగులు సిడం మధుకర్, కొట్నాక జల్పత్ రావు, కుడ్మేత బాదిరావు, గోడం జగన్నాథ్, కొట్నాక సుభాష్, తోడసం సోనేరావు, కేశవ్, హనమంత్ రావు, టేకం గంగారం పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం



నవతెలంగాణ-నస్పూర్

నేరాల నియంత్రణకి సీసీ కెమెరాలు కీలకమని, ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని కృష్ణ కాలనీలో 6 సీసీటీవీ కెమెరాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ప్రజలందరూ సీసీ కెమెరాలు పెట్టుకోవడం వలన మన సమాజంలో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు, త్వరితగతిన దోషులను గుర్తించడానికి వీలవుతుందన్నారు. సీసీ కెమెరాల ద్వారా కాలనీలో జరుగుతున్న చిన్న చిన్న గొడవలు, ప్రమాదాలను ఖచ్చితముగా కనిపెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. సీసీ కెమెరాలు పనిచేయడం ద్వారా మనకు చాలా వరకు నేరాలు తగ్గుతాయని ప్రతి ఒక్కరూ వారి యొక్క వార్డ్ లేదా కాలనీలలో కెమెరాలు అమర్చుకోవడం వల్ల కాలనీ ఏరియా మొత్తం నిఘా పర్యవేక్షణలో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ ఉన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయా ప్రయివేట్ ఆస్పత్రులను ఆయన తనిఖీ చేశారు. నిబంధనలు, లైసెన్స్ ప్రకారం వైద్యులు ఉన్నారా లేదా అనే దాన్ని పరిశీలించారు. వైద్యులు, వారి సర్టిఫికెట్లు, ఓపీ, రేట్ చార్టు తదితర వాటిని పరిశీలించి సూచనలు చేశారు. డీఎంఈ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో అగ్ని ప్రమాదలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఫైర్ సేఫ్టీపై దృష్టి పెట్టాలని సూచించారు. ఓ ఆస్పత్రిలో రేట్ చార్జ్ సక్రమంగా లేకపోవడంతో మందలించి నోటీసులు జారీ చేశారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. సీఎం ఆదేశాల మేరకు లక్ష్మణచాంద మండలం చింతల్ చందా గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం సన్న బియ్యం లబ్ధిదారులు తాండ్ర వసంత-రాజేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపన్నులతో సమానంగా పేదోడు సన్న బియ్యం తినాలని, ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం లబ్ధిదారు కుటుంబ వివరాలతో పాటు సన్న బియ్యం పథకంపై వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇందులో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గా భవాని, వ్యవసాయ కమిటీ ఉపాధ్యక్షుడు ఈటల శ్రీనివాస్, నిర్మల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాందెడపు చిన్ను, గాజుల రవి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బోథ్



సొనాల మండలంలోని సాకేర గ్రామానికి చెందిన విలేకరి దేవిదాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం సొనాల ఎంపీడీఓ దుర్గం రాజేశ్వర్ పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్ఐ శ్యాంసుందర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని యాకార్పెల్లి గ్రామానికి చెందిన కల్లూరు భారతి (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నిర్మల్ ఇంచార్జ్ రాంకిషన్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ బుధవారం మృతురాలి కుమారుడు వెంకట్‌ను పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకొని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వారి వెంట నాయకులు జీవన్ రావు, రామిరెడ్డి, దేవీశంకర్, లక్ష్మీనారాయణగౌడ్, లక్ష్మణ్, గణేష్, సతీష్ శ్రీధర్ జీవన్ ఉన్నారు.

ఉచిత శిక్షణ అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా పోటీ పరీక్షల కోసం ఉచితంగా జిల్లా కలెక్టర్ ఎంసెట్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని ఇందిరా ఫెలోషిప్ జిల్లా కోఆర్డినేటర్ నల్వాల సుమ అన్నారు. బుధవారం సంజయ్‌నగర్‌లో ప్రభుత్వ పరంగా కొనసాగుతున్న ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. అందిస్తున్న కోచింగ్, సౌకర్యాలు, భోజన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

తోటి డ్రైవర్‌కి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రెబ్బెన

ఆటో యూనియన్ ప్రెసిడెంట్ బోగారం ప్రతాప్ ఆధ్వర్యంలో డ్రైవర్ జాడి రవికుమార్ కుటుంబీకులకు బుధవారం ఆర్థిక సాయం అందించారు. రవికుమార్ గుండె సంబంధిత వ్యాధితో కరీంనగర్ అపోలో రీచ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, బుధవారం అతన్ని ఆస్పత్రిలో కలిసి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పి తమకు తోచిన సాయం చేశారు.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నియోజకవర్గంలోని లబ్ధిదారులకు గురువారం డీసీసీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీకి హాజరు కావాలని వారు తెలిపారు

ప్రకృతి వనరుల సంరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-తలమడుగు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రకృతి వనరుల సంరక్షణ అందరి బాధ్యతని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోరని ఝరి గ్రామంలో బుధవారం ప్రధానమంత్రి కృషి సించాయి యోజన వాటర్ షెడ్ పథకంలో భాగంగా వాటర్‌షెడ్ మొబైల్ యాత్ర వాహనాన్ని ప్రారంభించారు. అంతే కాకుండా గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన చెక్ డ్యాంకు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందించిన నీరు, ఇరతర వనరులను కాపాడుకోవడం అందరి బాధ్యతని అన్నారు. భూగర్భ జలాలు తగ్గి బోర్లు, వాగులు, బావులు ఎండిపోతున్నాయన్నారు. వర్షపు నీరుని చెక్ డ్యాంలు, రాళ్లకట్టలతో నిల్వ చేసుకుంటే భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. గాదిగూడ కొత్తపల్లిలో చెక్‌డ్యాం నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగాయని గుర్తుచేశారు. మండలంలో 6 గ్రామాలను వాటర్‌షెడ్‌కు ఎంపిక చేశామని, మహిళలు అభివృద్ధి చెందేందుకు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా మరిన్ని రుణాలు అందిస్తామని పేర్కొన్నారు. ఒకే రకమైన వ్యాపారం కాకుండా వివిధ రకాల వ్యాపారాలు చేసినట్లయితే ఆర్థిక స్థితి మెరుగుపడే వీలుంటుందన్నారు. అనంతరం 309 మంది మహిళలకు రూ.50 వేలు చొప్పున చెక్కులు అందించారు. అంతకు ఉముందు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్‌కు సమస్యలు విన్నవించగా సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి సమస్య తీర్చేందుకు కృషి చేస్తానని భరోసానిచ్చారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డీఆర్‌డీఓ రవీందర్, తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీఓ శేఖర్, మండల సమైఖ్య అధ్యక్షురాలు ప్రమీల, పీఓ గోరఖ్‌నాథ్, టీఓ మల్లేష్ మహేష్, వ్యవసాయ శాఖ అధికారి ప్రమోద్ రెడ్డి, ఎంపీఓ వినోద్, అదనపు డీఆర్డీఓ గోవిందరావు, ఏసీఎం చంద్రశేఖర్, సెక్రటరీ సోమ్‌భాయ్, మాజీ సర్పంచ్ రఘునాథ్, మాజీ ఎంపీటీసీ దివ్యభారతి పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించండి : ఐటీడీఏ పీఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా

నవతెలంగాణ-రెబ్బెన

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని, గోలేటి బాలుర ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. గోలేటిలో ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయకపోవడం, పిల్లలు బోర్వెల్ నీళ్లు తాగడం పై ఆరా తీశారు. మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు రవీందర్, వార్డెన్ మోహన్ దాస్ సోకాజు నోటీసు జారీ చేశారు. ఆసిఫాబాద్‌లో మెనూ పాటించకపోవడంపై, ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయకపోవడాన్ని దృష్టికి తీసుకురాలేదని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ఎస్ఏ హిందీ ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌కి సోకాజు నోటీసు జారీ చేశారు. వార్డెన్, డెప్యూటీ వార్డెన్, స్టాఫ్ సమయానికి అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలంరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించారు. సినిమా, జానపద గీతాలు, ప్రత్యేక నృత్యాలతో తోటి విద్యార్థులను ఎంతగానో అలరింపజేశారు. మూడు రోజులుగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపల్, అధ్యాపకుల ప్రోత్సాహంతో క్రీడాపోటీలతో పాటు, నృత్య ప్రదర్శనలు వంటివి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సంగీత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలోనూ రాణించి తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకోవాలన్నారు. ప్రతిభకు పదును పెడితే ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. ఉన్నత స్థితికి ఎదిగి తల్లిదండ్రులకు, కళాశాలకు గుర్తింపు తేవాలని కోరారు. ఇందులో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.